క్లుప్తంగా

మున్సిపాలిటీలో ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దపల్లిరూరల్: మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన 100రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య సిబ్బంది, అధికారులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం పారిశుధ్య సిబ్బంది శ్రమిస్తున్నారని, వారిని ఆరోగ్యవంతులుగా ఉంచేందుకు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని కమిషనర్ వెంకటేశ్ తెలిపారు.

ఆయిల్‌పాం గెలల సేకరణ



ఆయిల్‌పాం గెలలతో రైతులు, అధికారి జ్యోతి

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్, ముత్తారంలో ఆయిల్‌పాం పంట గెలల సేకరణను శుక్రవారం ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి పరిశీలించారు. ఆ గ్రామాల్లో మూడున్నరేళ్లలో సాగు చేసిన ఆయిల్ పాం పంట చేతికి రావడాన్ని ఆయిల్‌పాం కేం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి, రైతులతో కలిసి గెలల కొనుగోలుపై చర్చించారు. కోతకు వచ్చిన గెలలను ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తారని తెలిపారు. కల్యాణపు రాయమల్లు, నాంసాని సమ్మయ్య ఆయిల్‌పాం తోటలో గెలలు కోతకు వచ్చాయని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వచ్చే ఆయిల్ పాం సాగుపై రైతులు మొగ్గు చూపాలన్నారు. ఆయిల్‌పాం ఫీల్డ్ ఆఫీసర్ అజయ్, మాజీ సర్పంచ్ తాటిపాముల వకుళారాణి, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్ గ్రామంలో శుక్రవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మండల వ్యవసాయాధికారి కల్వల సతీశ్ అవగాహన కల్పించారు. ప్రకృతి సాగు విధానంలో రసాయనిక ఎరువులు గణనీయంగా తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రధానంగా పశుపోషణ కలిగి ఉన్న రైతులకు సమృద్ధిగా సేంద్రియ ఎరువు లభ్యత ఎక్కువగా ఉంటుందన్నారు. రైతులు సాగుకు ముందు చేపట్టే కార్యక్రమంలో భాగంగా తమ పొలంలోని మట్టిని పరీక్షల నిమిత్తం గ్రామ పంచాయతీలో అప్పగించాలని కోరారు. ఏఈవోలు హరీశ్, రమేశ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫాం) పంపిణీ చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కొలతల ఆధారంగా ఏకరూప దుస్తులు కుట్టిస్తున్న విషయం తెలిసిందే. పాఠశాలలు ప్రారంభం నాటికి విద్యార్థులందరికీ ఏకరూప దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో బైరి వేణుమాధవ్, ఎంఈవో ఏకాంబరం, ఐకేపీ ఏపీఎం సంది నర్సమ్మ, నవీన్, పాఠశాల హెచ్ఎం.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ ఉన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగా శిక్షణలో ఎస్సై రమేశ్

ఓదెల: ఇంట్లో ప్రతీరోజు యోగా చేస్తే ఆరోగ్యంగా ఉంటామని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని ఎస్సై ప్రారంభించారు. ఆయుర్వేద వైద్యులు ఆర్.ప్రభాకర్, యోగా శిక్షకులు అవినాశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



దారికి అడ్డంగా వాహనాల పార్కింగ్

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పట్టణంలోని జెండా కూడలి వద్ద గల ప్రధాన పోస్టాఫీసుకు పనుల నిమిత్తం వచ్చే ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. పోస్టాఫీసు ప్రవేశద్వారం ఎదుట వాహనాలను ఇష్టానుసారంగా నిలపడంతో పనుల నిమిత్తం పోస్టాఫీసుకు వచ్చే ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టపగలు కూడా వెలుగుతున్నాయి



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం మూలసాలలో పట్టపగలు కూడా వీధిదీపాలు వెలుగుతున్నాయి. పంచాయతీ సిబ్బంది సమయానుసారంగా వీధిదీపాలు వెలిగించి, ఆఫ్ చేయాలి. కానీ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రామగుండం: పట్టణంలోని సినిమా టాకీస్ వీధిలో అంతర్గత రహదారికి ఇరువైపులా చెట్లపొదలు గుబురుగా పెరిగి రోడ్డును కప్పేస్తున్నాయి. ఫలితంగా ఇరువైపులా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదాచారులకు చెట్లపొదలు తగులుతున్నాయి. అధికారులు స్పందించి పారిశుధ్య సిబ్బందితో చెట్లపొదలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

కేసీఆర్ పాలనలోనే రైతు సంక్షేమం



పంటను పరిశీలిస్తున్న పుట్ట మధూకర్

ముత్తారం: రైతుల సంక్షేమం కోసం మాజీ సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేశారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మండలంలోని అడవిశ్రీరాంపూర్‌లో నాంసాని సమ్మయ్య సాగు చేసిన ఆయిల్ పాం పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. పంట సాగులో మార్పు చేయాలన్న కేసీఆర్ గొప్ప ఆలోచనతో, ఉద్యానవన శాఖ అధికారుల ప్రోత్సాహంతో ముత్తారం మండలంలో ఈరోజు ఆయిల్‌పాం పంట చేతికి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే రైతులు బాగుపడ్డారన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను దగా చేస్తోందని విమర్శించారు. మాజీ ఎంపీపీలు జక్కుల ముత్తయ్యపటేల్, అత్తె చంద్రమౌళి, మాజీ సర్పంచుల కన్వీనర్ నూనె కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుదాడి రవీందర్ రావు పాల్గొన్నారు.

అలుపెరగని కార్మిక పోరాట యోధుడు మునీర్



నివాళి అర్పిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: కార్మిక సమస్యలపై అలుపెరుగని ఉద్యమం కొనసాగించిన గొప్ప వ్యక్తి ప్రముఖ జర్నలిస్టు మునీర్ అని పలువురు వక్తలు కొనియాడారు. సామాజిక ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు మునీర్ సంస్మరణ సభను శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్జీ వన్ జీఎం లలిత్‌కుమార్ హాజరై నివాళి అర్పించారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన ప్రెస్‌క్లబ్ సభ్యులు సిరిశెట్టి చిరంజీవి, చాతబోయిన శ్రీనివాస్ ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పూదరి కుమార్, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎం.వంశీ, సీనియర్ జర్నలిస్టు ఎస్.కుమార్, మాదాసు రామ్మూర్తి, కార్మిక సంఘాల నాయకులు కె.స్వామి, తుమ్మల రాజారెడ్డి, మిర్యాల రాజిరెడ్డి, రియాజ్ అహ్మద్, కెంగెర్ల మల్లయ్య, కె.విశ్వనాథ్, ఐ.కృష్ణ, రాములు, తోకల రమేశ్, కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు, సీపీఐ నాయకులు గౌతమ్ గోవర్ధన్, సీపీఎం కార్యదర్శి మహేశ్వరి, మునీర్ సోదరుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో సింగరేణి సహకారంతో మునీర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

బడిబాట ప్రారంభం



రామగుండం: ముర్మూర్ బడిబాటలో ప్రత్యేకాధికారి



ఎలిగేడు: ధూళికట్టలో బడిబాట

ఎలిగేడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు శుక్రవారం నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈవో నరేంద్రచారి, ఎలిగేడు, ధూళికట్ట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల హెచ్ఎంలు గంద్ర దేవేందర్‌రావు, బిజిలి సదయ్య, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు, టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధి ముర్మూర్‌లో నిర్వహించిన బడిబాటలో గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ రవీందర్‌పటేల్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాకలోని నరిసింహపురం జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణ బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట నిర్వహించారు.

జూలపల్లి: మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంలు, టీచర్లు బడిబాట నిర్వహించారు.

ఓదెల: మండలంలోని హరిపురంలో శుక్రవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో ఎర్ర రమేశ్, హెచ్ఎం మహేందర్‌రెడ్డి, ఏఏపీసీ కమిటీ చైర్మన్ పద్మ, కార్యదర్శి భాస్కర్, సీఆర్‌పీ ఓంకార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• మోదీ పాలనకే ప్రజల మద్దతు

పెద్దపల్లిరూరల్: భారత ప్రధాని మోదీ పాలనకే ప్రజలంతా అండగా నిలుస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రమేశ్ అన్నారు. మండలంలోని నిమ్మనపల్లిలో శుక్రవారం మోదీ 11ఏళ్ల పాలనపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలతో భారతదేశం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ చారిత్రక విజయం సాధించడంతో యావత్ దేశప్రజానీకం గర్విస్తోందన్నారు. నాయకులు సంపత్‌రావు, రాజేశ్వర్‌రావు, బాసాని లక్ష్మణ్, వేల్పుల సత్యం, ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, అట్ల కుమార్, మారుతి, సుబ్బారెడ్డి, శివయ్య, ఉమేశ్, రేండ్ల వేణు ఉన్నారు.

• భూభారతి రెవెన్యూ సదస్సులు

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్, కుమ్మరికుంట గ్రామాల్లో శుక్రవారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కుమ్మరికుంటలో నాయబ్ తహసీల్దారు అనిల్ కుమార్, వడ్కాపూర్‌లో తహసీల్దారు జక్కని స్వర్ణ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వడ్కాపూర్‌లో 89, కుమ్మరికుంటలో 48 వినతులు వచ్చాయి. సదస్సుల్లో ఆర్.భవానీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతినగర్: భూభారతిలో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని రామగుండం మండల తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు అన్నారు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లిలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ రామగుండం పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, మల్లేశ్, భరత్‌గౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని పొత్కపల్లి, కనగర్తి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఆయా గ్రామాల్లో 100మంది దరఖాస్తులు సమర్పించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఆర్ఐలు గౌతం, మహేశ్ పాల్గొన్నారు.

ధర్మారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఉదయకుమార్ కోరారు. మండలంలోని బంజేరుపల్లి తండా, రామయ్యపల్లి గ్రామాల్లో శుక్రవారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. బంజేరుపల్లి తండాలో 51 దరఖాస్తులు, రామయ్యపల్లిలో 38 దరఖాస్తులను రైతుల నుంచి అధికారులు స్వీకరించారు. ఆర్ఐలు వరలక్ష్మి, నవీన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

• కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ

సుల్తానాబాద్: మున్సిపల్ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం కార్మికులకు పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్, వైద్యులు ఉదయ్‌కుమార్, సింధూజ, మహేందర్, పీహెచ్ఎన్ భారతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

• స్ఫూర్తి మానసిక పాఠశాలకు చేయూత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని బండారికుంటలోని స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పాఠశాలకు రెండు సీలింగు ఫ్యాన్లు, విద్యార్థులకు క్వింటాల్ బియ్యాన్ని బీజేపీ సీనియర్ నాయకుడు జంగ చక్రధర్‌రెడ్డి, వనిత శుక్రవారం అందజేశారు. విద్యార్థులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు.

• తహసీల్దార్‌కు సన్మానం

ఎలిగేడు: ఇటీవల బదిలీపై వచ్చిన తహసీల్దార్ యాకన్నను శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు.

• ఖమ్మంపల్లిలో అగ్నిప్రమాదం

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన అల్లం సంపూర్ణ ఇంటి ఎదుట వరికుప్పలు మంటలు అంటుకొని, ఇంటికి మంటలు అంటుకోవడంతో సామగ్రి కాలిపోయాయి. ఇంటిలో విద్యుత్ తీగలు కాలింది. సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లింది. కొద్దిసేపటికి అల్లం శంకర్‌కు చెందిన రూ.10వేల ఖరీదు గల వరిగడ్డి కాలిపోయింది. స్థానికులు మంటలు ఆర్పడం, మంథని అగ్నిమాపకం వాహనం వచ్చి మంటలు ఆర్పడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

రైస్‌మిల్లు బకాయిలు ఇప్పించండి



వినతిపత్రం అందజేస్తున్న సంజీవరెడ్డి

సుల్తానాబాద్: రైస్‌మిల్లుల బకాయిలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇప్పించాలని ఎఫ్‌సీఐ కన్సెంటివ్ చైర్మన్ డీకే అరుణను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రైస్‌మిల్ యాజమాన్యానికి 10ఏళ్ల నుంచి రావాల్సిన సీఎంఆర్ సర్వీస్ చార్జీలతోపాటు బకాయిలను వెంటనే విడుదల చేయాలని విన్నవించారు. ఆమె సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రైస్‌మిల్ నాయకులు హనుమంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

గుండా నాగరాజు త్యాగం మరువలేనిది



నివాళి అర్పిస్తున్న సంఘం నాయకులు

మంథని: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసి ప్రాణత్యాగం చేసిన మంథనికి చెందిన గుండా నాగరాజు త్యాగం మరువలేనిదని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎల్లంకి వంశీధర్ అన్నారు. గుండా నాగరాజు 12వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నల్మాస్ ప్రభాకర్, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న ఆర్ఐ మల్లేశం

గోదావరిఖని: ఇటీవల ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు కుటుంబానికి పోలీసు అధికారులు, సిబ్బంది శుక్రవారం ఆర్థికసాయం అందించారు. హోంగార్డు దుగ్యాల తిరుపతి కుమారుడు అరుణ్ కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా అక్కడకు వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబానికి పోలీసు డిపార్ట్‌మెంట్ ఎంటీవో వింగ్ తరఫున రూ.27,500, ఏఆర్ విభాగం నుంచి రూ.32వేలు, ఉమ్మడి కరీంనగర్ పోలీస్ గ్రూప్ నుంచి రూ.17,500, ఆర్ఐ మల్లేశం రూ.3వేలు చొప్పున రూ.80వేలు తిరుపతి కుటుంబానికి అందజేశారు. ఆర్ఐ సిబ్బంది మైకాంత్, రాజయ్య ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో హరితహారం

రామగుండం: భారత ప్రధాని నరేంద్ర మోదీ 11ఏళ్ల సుపరిపాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు పిలుపునిచ్చింది. కాగా శుక్రవారం అంతర్గాం మండల కేంద్రంలో పార్టీ నాయకులు పలుచోట్ల మొక్కలు నాటారు. బీజేపీ అంతర్గాం మండల అధ్యక్షుడు బోడకుంట సుభాష్, బాలసాని సత్యం, ఆలకుంట మల్లేశ్, కొల్లూరి లక్ష్మణ్, ఆకుల హరీశ్, మాడ ప్రభాకర్‌రెడ్డి, మిడివెల్లి అంజి, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సింగరేణి అధికారులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చొరవతో సింగరేణి సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శుక్రవారం ఆర్జీ-2 ఎస్‌వోటూ జీఎం మాలోతు రాయుడు భూమిపూజ చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పెనుగొండ వెంకటయ్య భూమిని విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో వకీల్‌పల్లి ఏజెంట్ నెహ్రూ, ఎన్విరాన్‌మెంట్ అధికారి సురేశ్, కాంగ్రెస్ 14వ డివిజన్ అధ్యక్షుడు కొక్కిరాల శ్రీనివాస్, రాయమల్లుగౌడ్, కందుల సతీశ్, అర్జున్‌రావు, జంగ సంపత్‌యాదవ్, కొత్తపల్లి రాజు, సొల్లు కుమార్, గౌస్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

సింగరేణి డిపెండెంట్ విజిలెన్స్ కేసులు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మారుపేరు కార్మికుల డిపెండెంట్ల సమస్య పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. సింగరేణి డైరెక్టర్‌కు శుక్రవారం ఆయన వినతి పత్రం అందజేశారు. ఇటీవల తీసుకొచ్చిన సర్క్యులర్ ప్రకారంగా ఇంటర్వ్యూ పూర్తయిన కార్మికులను మెడికల్‌కు పంపకుండా విజిలెన్స్‌కు రాశారని, దీంతో 5నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఉద్యోగం ఇవ్వలేదన్నారు. పదో తరగతిలోపు చదువుకున్న డిపెండెంట్‌లు, మారుపేర్ల సమస్య ఉన్న అట్టి వారసుల ఫైల్స్ క్లియర్ చేయకపోతే ఆందోళన చేపడతామని పేర్కొన్నారు.

రక్షణపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

గోదావరిఖని: రక్షణపై కార్మికులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని రీజియన్ సేఫ్టీ జీఎం మధుసూదన్ ఆదేశించారు. జీడీకే-5 ఓసీపీ కార్మికులకు శుక్రవారం భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. పనుల్లో తీసుకోవాల్సిన రక్షణ సూత్రాలు వివరించారు. రక్షణతో పనిచేసి ప్రమాదరహిత సింగరేణిగా తీర్చిదిద్దాలని కోరారు. సేఫ్టీ అధికారి సాయిప్రసాద్, ప్రాజెక్టు అధికారి కె.చంద్రశేఖర్, ఆక్టింగ్ మేనేజర్ పానుగోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలలో ప్రవేశాల సందడి



ప్రవేశాల కోసం తల్లిదండ్రులతో వచ్చిన విద్యార్థులు

- ఖాళీలు 400.. దరఖాస్తులు 1,600
- సీబీఎస్ఈ సిలబస్ ప్రారంభంతో భారీ స్పందన

యైటింక్లయిన్‌కాలనీ: సెక్టార్ - 3 సింగరేణి పాఠశాలలో నర్సరీ నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ పద్ధతిలో విద్యాబోధనకు శ్రీకారం చుట్టారు. దీంతో సింగరేణి కార్మికులు, ఉద్యోగుల పిల్లలతోపాటు ప్రభావిత, సమీప ప్రాంతాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. సీట్ల సంఖ్య తక్కువగా ఉండడం, పిల్లలు అధికంగా తరలిరావడంతో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తున్నామని హెచ్ఎం సుందర్‌రావు తెలిపారు. నర్సరీ నుంచి ఒకటో తరగతి వరకు సింగిల్ సెక్షన్, రెండు నుంచి తొమ్మిదో తరగతి వరకు రెండు సెక్షన్లు ఏర్పాటు చేశామని, ఒక్కో సెక్షన్‌లో 40మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం 400 మంది విద్యార్థులు చదుకుంటున్నారని, ఇప్పుడు మరో 400 సీట్ల కోసం 1,600కుపైగా దరఖాస్తులు వచ్చాయని హెచ్ఎం వివరించారు. ఈనెల 9వ తేదీ వరకు ప్రతీరోజు తరగతుల ప్రకారం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామని, ఇందుకోసం ఫోన్‌ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందిస్తామన్నారు. ఈక్రమంలోనే శుక్రవారం మంచిరోజు కావడంతో తల్లిదండ్రులు, వారిపిల్లలు అధికంగా రావడంతో సందడి వాతావరణం నెలకొంది. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యాక ఈనెల12న పాఠశాలను పునఃప్రారంభించనున్నట్లు హెచ్ఎం తెలిపారు.

ఓసీపీ-1 గనికి ఉత్తమ పర్యావరణహిత గని పురస్కారం



పురస్కారం అందుకుంటున్న జీఎం నాగేశ్వరరావు

రామగిరి: ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-1 గని సింగరేణి సంస్థలో 2024-25కు గాను ఉత్తమ పర్యావరణహిత గని పురస్కారానికి ఎంపికైంది. కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా గని తరఫున ఓసీపీ-1 పర్యావరణ అధికారి కిషన్ అందుకున్నారు. జీఎం కార్యాలయంలో శుక్రవారం ఈ పురస్కారాన్ని పీవో జె.రాజశేఖర్, ఏరియా పర్యావరణ అధికారి రాజారెడ్డి, ఓసీపీ-1 పర్యావరణ అధికారి కిషన్‌లు ఆర్జీ-3, ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావుకు అందించారు. ఏపీఏ ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం బి.వి.సత్యనారాయణ, మేనేజర్ రమేశ్, అధికారి కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.